గుడిసె - దీర్ఘరోగి

ఎన్నిసార్లు వేసినా సంతృప్తి పరచడం లేదు.

అనుకొన్న "ఫీలింగు" రాలేదు. చిత్రాన్ని చూస్తున్న మిత్రులంతా అద్భుతంగా ఉందనే అంటున్నారు.

ముప్పై విధాల మార్చి చూశాను. "ఫీలింగు" రాలేదు!

చిత్రం అద్భుతంగానే ఉంది. తైల వర్ణాలతో వేసిన "దీర్ఘరోగి" చిత్రం!

గుడిసె దానిముందు నులకమంచంమీద కూర్చుని దీర్ఘరోగి. గుడిసె వెనక్కి రెండు యీత చెట్లు. వాటి మానులు ఏటేటా ఒక్కొ ఏడూ వొదల కుండా–కల్లుకి నరికిన నరుకులు–మెట్లుకట్టి ఉన్నాయి. వాటి తలలకింద తెగకోసిన పీకలికి కల్లుకుండ లున్నాయి. ఓమూల చిత్రానికి తూకం సరి పెడుతూ నాలుగు కాళ్ళూ జాపి పంది పడుకుని ఉంది. బాగా వెనక ఆకాశం చివరిదాకా ప్రదేశ వైశాల్యం కనబడుతుంది. అదీ నే వేసిన చిత్రం.

రంగుల కలయిక పరస్పరం ఖండించుకుంటూ అడ్డదిడ్డంగా వేసిన రేఖలపొందిక బహుమంచి చిత్రాన్ని శాస్త్రరీత్యా రూపొందించాయి.రంగులూ రేఖలు సరిపోతే ఏమి రాసినా చిత్రమే. రోగి మొహంలో "ఫీలింగు" నేను కోరుకున్నట్టు రాలేదు. దీర్ఘరోగి అని తెలుస్తున్నది. రోగపు తీవ్రత అను కున్నంత ఆదర్శప్రాయంగా బహిర్గతం కాలేదు. గుడిసె అద్భుతంగా సెట్టయి అమిరింది. రోగి మొహం, చూపు నన్ను సంతృప్తి పరచడం లేదు.

నా చిత్రాలలో ఆదినుంచి గుడిసెకి ప్రాధాన్యత అధికం. దృశ్య చిత్రం నేనేది వేసినా అందులో ఎక్కడో ఒకచోట గుడిసె చోటు చేసు కుంటుంది. గుడిసె అందం నన్నెపుడూ ఆకర్షిస్తుంది. ఏళ్ళ తరబడి శిల్పు లంతా చేరి కట్టిన తాజ్‌మహల్ గోరీకన్నా పాడేరు కొండచరియల్లో సవర వాడి గుడిసె నన్నాహ్లాద పరుస్తుంది.

కోకిలమీద పద్యం రాయని కవి కిశోరాలూ, గుడిసె చిత్రం వెయ్యని ప్రారంభ చిత్రకారులూ ఉండనిమాట వాస్తవమే కాని నా తొలి బహుమతి చిత్రం గుడిసే. అన్నిదేశాల చిత్రకారుల చిత్రాల్లో గుడిసె కనబడుతూ ఉంటుంది. చిన్నప్పుడు దాని అందం ఒక్కటే నన్ను ఆకర్షిస్తూ ఉండేది. ఇప్పుడూ దానందం ఆకర్షిస్తుంది. ఐతే విషాదం కలుస్తుంది. పెద్దపులి సౌందర్యంలో క్రౌర్యంలాగ!

చిన్నప్పుడు నా అభిమాన కవి "వర్డ్సువర్తు" ఎక్స్కర్షన్ (Excursion) కావ్యాన్ని చదువుతూ కొండొద్దున బండమీద కూర్చుని ప్రకృతి సౌందర్యంలో లీనమైపోయేవాణ్ణి. చిత్రం వేసుకుంటూ రంగులో రంగులు కలుపుతూ కొత్తరంగుల వైచిత్రిలో కలిసిపోయేవాణ్ణి. తాదాత్మ్యం పొందేవాణ్ణి. భూమ్మీద మనిషై పుట్టినందుకు సౌందర్యానికి ముగ్ధుడనౌతూ ఆస్వాదిస్తూ జీవించడమే పరమావధిగా కనబడేది.

ఇదంతా ప్రారంభ యౌవనంలో ప్రారంభ చిత్రకారుడిగా!

సరియైన జ్ఞానం కలిగిన తరవాత తెలిసింది, కోటానుకోట్ల ప్రజలు పెళ్ళాం పిల్లలతో గుడిసెల్లోనే జీవిస్తున్నారనీ—కోటానుకోట్లు సగం తిని, అదీలేక దరిద్ర జీవితం శ్రీరాములువారి కాలంనుంచీ, అశోకుల వారి కాలం నుంచీ నేటిదాకా జీవిస్తున్నారనీ, గుడిసెల్లో పుట్టి గుడిసెల ముందు దుర్భరమైన చావులు చస్తున్నారనీ—మొగవాడు గోచీతో, ఆడది చింకికోక ఉళ్ళుకంపుతో బతుకంతా బతుకుతూ మానం కాపాడుకొంటున్నారనీ కాస్త జ్ఞానం వచ్చాకే తెలిసింది. గుడిసే ఈ దేశస్థుడి నివాసం! ఈ జాతి ప్రతీక. గాంధీజీ ఎక్కడికి వెళ్ళినా గుడిసె కట్టుకునేవాడు. గుడిసెల్లో దిగేవాడు. అంగవస్త్రం కట్టేవాడు. కోటానుకోట్ల మూగజీవుల ప్రతినిధి!

పైపైని చూస్తే గుడిసె కృష్ణశాస్త్రి గీతం! లోలోతుకి చూస్తే గుడిసె భయానకాలగూడు! గూడుమీద "తెల్లని మల్లెచి కుండలు గగనమ్మున చుక్కలు!"

అతి మనోజ్ఞమైన గుడిసె నా "దీర్ఘరోగి" చిత్రంలో వేశాను. ఈ చిత్రం నారాయణబాబు "దేశమాత," శ్రీశ్రీ "భిక్షువర్షీయసి" గీతా లేతాలెత్తగా బైటకొచ్చింది.

ఈ చిత్రం నా ఊహలోకి రావడానికి యథార్థ సంఘటన ఒకటుంది. ఊరవతలికి షికారుపోతే మర్రిచెట్టు కింద పల్లెటూరివాళ్ళు సేదతీరుతున్నారు. రోగగ్రస్తుణ్ణి నులకమంచంమీద వాళ్ళ పల్లెనుంచి పదహారుమైళ్ళు పట్నంలో పెద్దాసుపత్రికి మోసుకొచ్చారు. అక్కడ వైద్యంవల్ల ప్రయోజనం లేకపోగా తిరిగి వాళ్ళ పల్లెకు పదహారుమైళ్ళూ మోసుకుపోతూ ఉంటే పట్నం చివరికి రాకుండానే, ఆ నులకమంచంమీదే ఎక్కడో ప్రాణం గుటుక్కుమంది. నులకమంచంతో ఆ శవాన్ని కిందదించి మర్రి కింద చతికిలపడ్డారు. పదహారుమైళ్ళు మనిషిని మోసుకొచ్చారు. పదహారు మైళ్ళూ శవాన్ని మోసుకెళ్ళాలి.

అది చూసి దీర్ఘరోగి చిత్రం కాన్వాసుకి ఎక్కించాను. పూర్తి చేశాను. ఏం లాభం? రోగి చచ్చిపోతాడేమో అన్నట్టు ఉండాలి. బాధ మొహంనిండా మూర్తీభవించాలి. ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. ఆ మొహం కోసం! ఆస్పత్రులముందు నిలబడి ఎందరెందరో రోగుల్ని పరిశీలన చేశాను.

చిట్టచివరకి కృతకృత్యుణ్ణయ్యాను. వచ్చేసింది నాక్కావలసిన "ఫీలింగు." మహాద్భుతమైన చిత్రం "బోద్లేరు" గీతాన్ని మించిపోయింది. విమర్శకులు ఆకాశానికి ఎత్తేశారు. ప్రదర్శనాలలో బహుమతులందుకొంది. బొంబాయి కోటీశ్వరుడు కొనేశాడు. నా చెయ్యి దాటి వెళ్ళిపోయింది. నాలుగు వేలు ఖరీదు పెడితే ఎవడూ కొనడనుకున్నాను. ఒకడు చిత్రకళా ప్రదర్శనంలో కొనేశాడు—నా చిత్రం ఇంక నాది కాదు!

ఆ చిత్రం బొంబాయి పట్టణంలో మలబారుగుట్టలదగ్గర కోటీశ్వరుడి మహాసౌధంలో ఉంది! ఆయన హాలు ఒక చిత్రకళా ప్రదర్శనశాల. చూడ్డానికి వెళ్ళండి. నేను వెళితే కౌగిలించుకున్నాడు. శాలువావేసి సత్కరించాడు. ఆయన మిత్రులందరికీ పరిచయం చేశాడు. ఎవరెళ్ళినా ఓపికతో చిత్రాలన్నీ చూపిస్తాడు. వివరించి చెపుతాడు. టీ యిచ్చి పంపుతాడు.

నా చిత్రంలో ఉన్న "ఫీలింగు"కి ఆ మహానుభావుడు కొనలేదు! చిత్రంగా చిత్రానికి ఉన్న విలువనిబట్టి కొన్నాడు! ఆ చిత్రం ఎన్నిసార్లు చూసినా ఆ కోటీశ్వరుడిలో ఏ మార్పూ కలగదు. ఆ చిత్రంలో ప్రధానమైన రంగు ఏమిటో, మిగిలినరంగులన్నీ ఎలాగ్గా మిళితమైనాయో, చిత్రం

ఏ విధంగా "కంపోజు" అయిందో అలాంటివి ఆయన నేర్పుతో తెలివిగానే చెపుతాడు.

ఒక్క సుగుణం అతనిలో ఉంది. చిత్రాలని అన్ని ముఖ్యమైన ప్రదర్శనలకి పంపుతాడు. నా "దీర్ఘరోగి" చిత్రం ఈ దేశానికి సందేశాన్ని ఇస్తూ ఎక్కడవున్నా దాని పని అది చేస్తూనే ఉంటుంది.

చిత్రాన్ని చూసీ చూడ్డంతో "దీర్ఘరోగి" మొహంలోకి దృష్టిని లాగేస్తుంది. రోగి చూపుతో చూసేవాడి చూపు కలుస్తుంది. గుండె గుభేలు మంటుంది. ఆ చూపు ఏదో అర్థిస్తూ ఉంటుంది. భరించశక్యంకాని బాధతో. మరణ వేదనతో మనని ఏదో ప్రశ్నిస్తున్నట్టు కోరుతున్నట్టు కనబడుతుంది. సరియైన మందు వెయ్యమనా? గొంతుకలో కాస్త మంచినీళ్ళు పొయ్యమనా? నేనిలాగా చావవలసిందేనా? చంపుతారా? ఎన్నాళ్ళు చంపుతారు? అని వెయ్యి ప్రశ్నలు వేస్తున్నట్టు ఉంటుంది.

ఆ చూపులో ఆ మొహంలో అంత "ఫీలింగు" పట్టేసింది. ఆ "ఫీలింగు" ఎలాగ పట్టుకున్నాను? నా బుద్ధి కౌశలం మాత్రంకాదు. కాపీ కొట్టేశాను—

ఎక్కడ దొరికిందా మొహం? ఇంటికొచ్చిన ముష్టిదాని మొహం చూసీ చూడ్డంతో "అమ్మయ్య" అనుకొన్నాను. నాకు కావలసిన మొహం ఆ ముసలి ముష్టిదాని మొహం. దీర్ఘరోగంతో సమీపించిన చావు స్పష్టంగా కనబడుతూ, కర్రవూతతో నడవలేక నడుస్తూ, అరవలేక అరుస్తూ ముష్టెత్తుకు బతుకుతున్నాది. ఎందులోనోపడి ఎందుకీ బతుకని చావలేక బతుకుతున్నాది.

గుమ్మంలోకి వచ్చి ముష్టిది ముష్టి అరుపు అరిచింది.

"నీకు తిండి పెడతాను. పావుగంట నిలబడతావా?" అని అడిగాను.

"కడుపుకి ఎడితే బాబూ పావుగంటేటి? గంట నిలుసుంటాను" అంది.

"పావుగంట చాలు" అన్నాను.

"ఎందుకు బాబు?"

"నిన్ను చూస్తూ నీ బొమ్మ వేసుకుంటాను."

"ఎందుకు బాబూ?"

"నాకెందుకో కావాలి."

"మనిషిని సూసి ఎయ్యగలరా?" తెలియని విషయం తెలుసుకోవాలనే అడిగింది.

"వేస్తాను నువ్వు మాత్రం ఎండలో నిలబడాలి."

"ఎండకేటి బాబూ? బతుకంతా ఎండే! ఎండుతూనే బతికినాము. ఎండపడక కూడెక్కడ? ఎండే మా ఎన్నెల" అన్నది ముసలి ముష్టిది.

"నీడలు, ఎండ వెలుగులూ పడి దాని మొహంలో ఎనభై ఏళ్ళ జీవితపు బాధ, మరణవేదన దేదీప్యమానంగా దివ్యజ్యోతులై వెలుగుతున్నాయి! దివ్యత్వం అన్నింటా ఉంది-వేదనలోనే చూశా!

ముసిల్ది చేతులు మీదికెత్తి ఈగలు తోలుకొంది. జుత్తు ఎత్తి పట్టుకుంది.

"కదలక మొహం ఎత్తి నిలుచో" అన్నాను.

"ఊరునిండా దిక్కుమాలిన ఈగలు! ఎక్కడికెళ్ళినా ఈగలే!" అంది. ఊరినిండా ఈగలులేవు. ముసలమ్మమీద స్థిరపడి ముసలమ్మతో ఊరేగుతున్నాయి. కాళ్ళనుంచి నెత్తిదాకా పట్టేశాయి. వొంటినిండా జుమ్ము మంటున్నాయి. సరిగ్గా నా దీర్ఘరోగి!

ముసలమ్మ జుత్తు చీపురు డొంకలాగ తెల్లగా మీదికిలేచి ఉంది. దాన్నంతా కూడదీసి వెనక్కి ముచ్చటగా "ముచ్చటముడి" వేసుకుంది. నాకు కావలసినది దాని మొహంమొక్కటే. అది జుత్తు సరిచేసి ముడివేసుకుంది. నా వొళ్లు జల్లుమంది.

నాలోనూ ఉంది సౌందర్య పిపాస. ముసిలి ముష్టిదానిలోనూ ఉంది. సౌందర్యం కోసం తపన! అందంకోసం అన్వేషిస్తున్నాను. చుట్టూ అందగించుకొంటున్నాను. అందంకోసం ఆరాటపడుతున్నాను. అందంకోసమే బతుకుతున్నాను. చచ్చే ముసిలి ముష్టిదానిలోనూ అందగించుకోవాలనే వాంఛ మిగిలి ఉంది. నే బొమ్మ వేస్తానంటె బైటకొచ్చింది.

"జుత్తెందుకు ముడివేశావు?" అడిగాను. అది ఎందుకు వేసుకుందో తెలుస్తూనే ఉంది.

"సింపిరిగా ఏటి బాగుంటాది?" అడిగింది! నేను గ్రహించినదీ

ముసల్ది చెప్పిందీ ఒక్కటే? చింపిరిగా జుత్తు బాగుండదు. సంస్కరించు కోవాలి. అందమైన బతుకే అందరికీ కావాలి?

ఆ ముసిల్దాని మొహం "ఫీలింగే" నా దీర్ఘరోగి 'ఫీలింగు'! కాపీ కొట్టేశాను. దాని అధరోష్ఠం వాలిపోయి చొంగలు కారుతోంది. ఆ చొంగే ప్రబంధ కవుల అధరసుధ. దాని యౌవనంలో దాన్ని ప్రేమించినవాడు బతికి ఉంటే ఇప్పుడూ అదే!

"మనిషిని మనిషి ఏం చేస్తున్నాడో" దాని చూపు చెప్పేస్తున్నాది.

ఆ మొహాన్నే నా చిత్రంలోకి దిగుమతి చేసుకున్నాను. దాని "ముచ్చటముడి" వినియోగించుకోలేకపోయాను.

ఆ "ముచ్చటముడి" మనిషిలో అంతర్గతమై ఉన్న సౌందర్య పిపాస!

అదీ నా చిత్రం.

"గుడిసె-దీర్ఘరోగి."